
ఆర్టికల్..

# 'చలం రచనలో స్త్రీ'

-ఝాన్సీ కె.వి.కుమారి

## స్త్రీ స్వేచ్ఛకోసం, నూతన యుగ నిర్మాణం కోసం తన జీవితమంతా ధర్మయుద్ధం జరిపిన సత్యవాది చలం.

**సాంఘీక చైతన్యానికి అర్ధశతాబ్దంపైగా అవిరళపోరాటం జరిపిన విప్లవ మార్గ దర్శకుడు!**



ఈ స్వార్ధ భూయిష్ట సమాజాన్ని ప్రక్షాళనం చేయటానికి అవతరించిన మహా అగ్ని!

చలం రచనల్లో స్త్రీ ప్రముఖ పాత్ర వహిస్తుంది. తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది.

"నా జీవితంలో స్త్రీ సమస్య వచ్చి, నా హృదయంలో రక్తాన్ని ఉడికించిందాకా నేను వ్రాయగలననే సంగతి నాకు తెలీదు. ఇప్పుడు ఆ విషయం తప్ప ఇంకేమీ చేతకాదు"

అని స్త్రీ సమస్యల ప్రభావం తనమీద ఎంత బలంగా ఉందో చెప్పుకున్నారు చలం తన ప్రేమలేఖల్లో.

అందుకే దాదాపు ఆయన రచనలన్నింటినీ స్త్రీ విముక్తికై అంకితం చేశారు.

'వివాహం' అనే సంప్రదాయ ముసుగులాంటి తతంగాన్ని తుడిచి పెట్టాలని ఆయన కోరుకునేవారు.

'వివాహమనేది భార్యాభర్తలను కలిపి ఉంచే ఒక బంధమే తప్ప అందులో ప్రేమలేదు. ఈ వైవాహిక బంధం వలన కోమలభావాలెన్నో నశిస్తాయి. ప్రేమ ఎండిపోతుంది' అంటారు చలం.

భార్య మరణిస్తే మూణ్ణెల్లు నిండకముందే మళ్ళీ వివాహానికి సిద్ధపడ్తారు పురుషులు, భర్త మరణిస్తే శేషజీవితమంతా అతని నామస్మరణతోనే గడిపే స్త్రీల దయనీయ పరిస్థితులు చలం హృదయాన్ని కదిలించి కలాన్ని ఉరికెత్తించాయ్.

స్త్రీ 'మాత్రమే ఎందుకు ప్రేమించాలి? ఒక్కరితోనే ఎందుకు జీవించాలి? ఒక్కరినే ఎందుకు ప్రేమించాలి?' అని ప్రశ్నిస్తారు చలం!

అన్ని అనర్థాలకూ ఆలవాలమైన వివాహధర్మాన్నే నిర్మూలిస్తే...తన రచనలన్నింటిలోనూ ఇదే భావాన్ని స్ఫురింపజేశారు ఆయన.

చలం గారి స్త్రీని అర్థం చేస్కోవాలంటే ఆయన స్త్రీ పాత్రలను తెలుసుకోవాలి.

☆ చలం మొదటి నవల 'శశిరేఖ.' ఇందులో శశిరేఖ, రామారావు బాల్యమిత్రులు, వివాహం చేసుకోవాలనుకుంటారు, కాని రామారావు ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్తారు. ఈలోగా తల్లిదండ్రుల బలవంతం మీద శశిరేఖకు వేరే వ్యక్తితో వివాహం జరిగిపోతుంది. తర్వాత శశిరేఖ కృష్ణుడనే మరో వ్యక్తిని ప్రేమిస్తుంది. కట్టుకొన్న భర్తను కాదని కృష్ణునితోనే ఉండిపోతుంది. డాక్టరై తిరిగివచ్చిన రామారావును చూసిన శశిరేఖ, చిన్ననాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని, అతనిపై మరులుగొని అతనితో జీవించడానికి వెళ్ళిపోతుంది. ఇది చలంగారి శశిరేఖ జీవిత చరిత్ర.

సౌందర్యా రాధనమే ఆమెనీతి! ప్రేమైక జీవిని ఆమె! సాంఘిక ధర్మం కంటే మానవ ధర్మం, మనిషి మనస్సు ఉన్నతమైనవంటారు చలం.

☆ వీరిరెండవ నవల 'దైవమిచ్చినభార్య.' ఇందులో నాయిక పద్మావతి. పద్మావతీ రాధాకృష్ణులు కూడా బాల్య స్నేహితులే. పద్మావతి వివాహం మేనమామ న్యాయమూర్తితో జరుగుతుంది. న్యాయమూర్తికూడా ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్తాడు. పద్మావతీ రాధాకృష్ణుల ప్రణయం నిరాఘాటంగా సాగిపోతుంది. కారణాంతరాల వల్ల రాధాకృష్ణుడు శకుంతలను వివాహమాడి ఆమె వలన సంతానవంతుడు కూడా అవుతాడు.అయినప్పటికీ అతని భార్య పద్మావతియే యని అతని భావన. న్యాయమూర్తి విదేశాల నుండి వచ్చిన తర్వాత సంఘర్షణ మొదలవుతుంది. ఆమెను తనతో రమ్మని ప్రియుడు రాధాకృష్ణుడు, తనతోనే ఉండిపొమ్మని భర్త న్యాయమూర్తి - ఎవరినో ఒకర్ని కోరుకొమ్మని రాధాకృష్ణుని బెదరింపు దానికి పద్మావతి ఇచ్చిన సమాధానం "ఎవరో ఒకరు ఉండితీరాలా ఏమిటి మొగనాధుడు? నాకు మీరిద్దరూ అక్కర్లేదు! న్యాయమూర్తి గారూ, నేను మీ పదార్థాన్ని కాదు. మీరు చెప్పినట్లు మీ ఆజ్ఞకు లోబడి ఉండేందుకు. రాధా, నీదాన్ని కాదు. నీతో వచ్చేయడానికి! నాకోసం మీరెందుకిట్లా బొమికముక్కల కోసం కుక్కల్లాగా పోట్లాడతారు? ఇది నా ఇల్లు, నేనిక్కడే ఉంటాను" అని ఖచ్చితంగా చెబుతుంది.

ఎంత ధైర్యం! ఎంత ఆత్మ విశ్వాసం? పద్మావతి చివరకు రాధాకృష్ణుని కోసం ప్రాణత్యాగం చేస్తుంది.

స్త్రీ ప్రేమను ప్రేమిస్తుంది, ప్రేమకేలోబడుతుంది గాని, అధికారానికి, స్వార్థానికి, క్రౌర్యానికి ఏమాత్రం తల ఒగ్గదు... అని చలం గారు చేసిన స్త్రీ హృదయ విశ్లేషణ ఇది!

☆ 'అమీనా' చలం గారి మూడవ నవల. ఈ కథ యదార్థమైనదని రచయిత అంటారు. అమీనా

**పురుషుణ్ణి కాల్చి, మెడవంచి, కళ్ళు తెరిపించి అతని ఆత్మని, అతనికి చూపడానికే స్త్రీ సౌందర్యం సృష్టించబడింది అంటారు చలం.**

తురకల పిల్ల! పేదది. వారి వృత్తి చేపలు పట్టుకోవడం. యాదృచ్ఛికంగా నాయకునికామె తటస్థపడుతుంది. తర్వాత అతని దగ్గరే పనిచేసుకుంటూ, కొంచెం చనువుగా తిరుగుతూ ఉంటుంది. యజమానితో ఇలా ప్రవర్తిస్తున్నందుకు తిట్లుతిని, తన్నులుతిని, పోతూ, వస్తూ ఉంటుంది. ఇది అమీనా కథ! అమీనాను తలచుకొన్నప్పుడల్లా ఆహ్లాదకరమైన ఉత్సాహానికి తోడ్పడే పన్నీరు, మార్దవమైన పూపరిమళం జ్ఞప్తికి వస్తాయి. అదే నాజూకు, అదే మొండితనం, అదే స్నేహం అని అంటారు చలం. "ఎదగని పువ్వు నా అమీనా" అనే మాటలతో ఈ నవల ముగుస్తుంది. తన అంతఃకరణను తన విశ్వాసాన్ని గుర్తించడం కోసం, తన ఆత్మకోసం రచయిత చేసిన అన్వేషణ ఇది.

☆ వీరి నాల్గవ నవల 'మైదానం.' నాయిక రాజేశ్వరి ఒక బ్రాహ్మణ ప్లీడరు భార్య. ఈమె 'అమీర్' అనే మహ్మదీయుని ప్రేమించి అతనితో వెళ్ళిపోతుంది. చలంగారి భాషలో 'లేచిపోతుంది'. వీరు ఒక మైదానంలో కాపురం పెడతారు. అక్కడ ఆమె 'మీరా' అనే కుర్రాణ్ణి కూడా ప్రేమిస్తుంది. ఇదంతా ఓ కాముక వ్యవహారం లాగా కనిపిస్తుంది. కాని చలం దీన్ని ప్రేమ, త్యాగం అంటారు.

"ఇంటినీ, బంధువుల్నీ, భర్తనే మరపించగల అనుభవం ఎంత ఉన్నతమో అద్భుతమో" అని అన్పిస్తారు తన నాయికతో.

ఈమె తన సంసారాన్నీ, భర్తను విడిచివచ్చిన పిదప తన జీవితం మహోన్నతమైనదనీ, తనకు దేవత్వము, అమృతత్వం లభించాయనీ అంటుంది.

☆ చలం గారి నవలల్లో ఐదవది "వివాహం." ఇందులో స్త్రీ స్వభావం, భర్తల దౌర్జన్యం, సంఘ పతనము వ్యాఖ్యానించబడ్డాయి. రమణ భర్త గోపాల రావుకు ఆత్మగౌరం, ఆత్మవిశ్వాసం చాలా తక్కువ. అందువల్లనే తన భార్య దృష్టిలో తాను తక్కువేమోనని, తన భార్య తనకు దక్కకుండా పోతుందేమోనని ఒకటే వేదన పడుతుంటాడు. చివరకు భార్యా భర్తలిరువురు ఒకరినొకరు అర్థం చేసుకోవడం, పవిత్ర ప్రేమతో కలిసి పోవడంతో నవల ముగుస్తుంది.

ప్రతి పురుషుడు పరస్త్రీలతో సంబంధ బాంధవ్యాలు కావాలని వాంఛిస్తాడు. కాని తన స్త్రీ మరొకరితో చనువుగా ఉండడాన్ని సహించడు అని చలం గారు తన నవలల్లో చూపిస్తారు. అందువల్లనే 'స్త్రీకి స్వేచ్ఛ, సెక్స్‌లో స్వేచ్ఛ' అనే నివాదాన్ని ఈయన రూపొందించారు. వితంతు వివాహాలు సాధించిన వీరేశలింగం గారు, స్త్రీ నీతి చట్టాల్ని వెక్కిరించిన చలానికి స్పిరిటల్ ఫాదర్ అనడం సమంజసమేనేమో.

☆ చలంగారి మరో నవల "అరుణ". అరుణా చలం దర్శించిన స్త్రీత్వానికి నిజమైన ప్రతీక! స్త్రీత్వం.. తన ఆకర్షణతో పురుషుని కవ్వించే అర్థంకాని తత్వం, స్త్రీ వలన పురుషుడు పొందే దివ్యానుభూతి యొక్క మధుర స్వప్నం ఒకవైపు, సంఘం స్త్రీకి ఏర్పరచిన బాధ్యతల, కట్టుబాట్ల కఠినమైన వాస్తవికత మరోవైపు... ఈ రెంటి మధ్యనలిగే స్త్రీత్వం నిరాశ్రయమై, నిరాధారమై అదృశ్యమౌతుంది. ఇదీ ఆ నవల ఇతివృత్తం. స్వేచ్ఛను, అనంతమైన ప్రేమనూ కాంక్షించే స్త్రీగా అరుణ దర్శనమిస్తుంది.


☆ సంఘం దృష్టిలో 'పతిత' అనబడే స్త్రీ కథను 'బ్రాహ్మణీకం' అనే నవలలో చెప్పారు. సంఘాన్ని, కట్టుబాట్లనీ ఏర్పరచినవాడు పురుషుడు గనుకనే అతనికి ఏ నీతి నియమాలూ వర్తించవు.

అతను స్వేచ్ఛగా ఆనందంగా తిరగవచ్చు, పర్యవసానంగా స్త్రీ మోసగించబడుతోంది, దగా చేయబడుతోంది.

ఈ దారుణమైన దగాకి కారణం డబుల్ స్టాండర్డ్స్... దొంగ విలువలు హిపోక్రిటికల్ వాల్యూస్.. ద్వంద్వ ప్రమాణాలు! అంటే చెప్పేదొకటి... ఆచరించేది మరొకటి! ఇటువంటి వ్యవస్థలో సంపూర్ణ వికాసం సాధ్యపడదు, వ్యక్తిత్వాలు వికసించవు, ముకుళించుకు పోతాయి. అవి సంఘానికి అనర్థదాయకం!

సమాజంలోని ఈ ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించడానికే ఆయన తన కలమనే ధ్వజం ఎత్తాడు. సమాజం మీద యుద్ధం ప్రకటించాడు. పురుషుల దౌష్ట్యాన్ని దుయ్యబట్టాడు.

☆ వివాహితమైన స్త్రీ వంటా, సేవా, చీవాట్లు, చికాకు దినదినమూ భరిస్తూ, కళ్ళు ఆకాశంవైపు, ఆత్మ సౌందర్యంలోకి సంచారం చేస్తూ, పిల్లల చదువుల్లో, పెళ్ళిళ్ళలో, వియ్యపురాలి మన్ననల్లో, దీపాలార్పిన చీకట్లో, దొడ్డిపందిట్లో, వీధి గుమ్మం దగ్గరా, ఒక్క చూపుకి, ఒక్క మాటకు కరవువాచి, మర్యాదస్థుల (?) మాయమాటల్లో, నేరస్థుల నీతి నియమాల్లో తన జీవితాన్నే ఆర్పివేసుకుంటూంటే చలం ఆత్మ ఆవేదనతో ఘోషపెడ్తుంది తన



మ్యూజింగ్స్‌లో.

"మనుషులా, సంఘమా, కర్మా, దేవుడా? ఎవరా? ఏది? ఏమిటి కారణం? గుడ్డితనం పరిపాలిస్తోందా లోకాన్ని? క్రౌర్యం కాలిక్రింద నొక్కుతోందా హృదయాల్ని? ఎక్కడిగతి? ఏది విముక్తి?

హృదయ లోతుల నుండి ఉబికివచ్చే ఈ ప్రశ్నలకు సమాధానం కూడా ఆయనే చెప్పుకున్నారు.

"సంఘాన్ని ఎదిరించండి, కులమతాలను ఖాతరు చేయకండి, నమ్మిన దాన్ని ఆచరించండి, మనస్సులోని కోరికను చంపివేయకండి, వంచననూ, కపటత్వాన్ని కడిగి వేయండంటూ... హిపోక్రసిలో బ్రతకడం దేనికి" అని ప్రశ్నిస్తారు చలం.

తీవ్రమైన ఉద్రేకంతో, సంఘాన్ని, కట్టుబాట్లనీ, నీతుల్నీ, నటనల్నీ తూర్పారబట్టి, తునాతునియలు చేసి సమాజం కప్పుకున్న ముసుగుల్ని లాగివేసి, లోపల ఉన్న కుళ్ళును ప్రక్షాళనం చేయబూనిన ప్రవక్త చలం!

చలం కలం విశృంఖలం అంటారు శ్రీశ్రీ. బానిస శృంఖలాలను బ్రద్దలు కొట్టి స్త్రీకి,, విముక్తిని ప్రసాదించాలన్న తపనే ఆయన రచనల్లో పరుచుకొని ఉంటుంది.

పెళ్ళి అనే బలిపీఠం మీద తమ వ్యక్తిత్వాన్ని బలిచేసుకొని... నిండు జీవితాలను కృత్రిమంగా, తమ కొరకు కాక, పరుల కొరకు బ్రతికే స్త్రీల నిజ జీవితాలు ఆయన హృదయాన్ని కదిలించి వేశాయ్... కలచివేశాయ్.

"నీచులైన భర్తల నిరంకుశాధికారం నుంచి బైట పడండి, నీచులు, అధములు అవుతారా, జీవితం నాశనం అవుతుందా కానీండి" ఇదీ చలంగారి ఉపదేశం స్త్రీలకు.

"తమ స్త్రీలు... తల్లులు, అక్కలు, చెల్లెళ్ళు, భార్యలు అలా చెడిపోవడం చూసినపుడైనా, ఈ మగ వాళ్ళకు బుద్ధి వస్తుందేమో - అప్పుడైనా పురుషులు స్త్రీలను గౌరవించడం నేర్చుకుంటారేమోననే ఆశ!" అంటారు చలం. ఎంత వాస్తవిక దృక్పథం!

ఎందరో రచయితలు, కవులు... వందలకొలది, వేలకొలది పుస్తకాలు వ్రాశారు గానీ, ఈ వ్యవస్థలో ఉన్న సమస్యలు గానీ తద్వారా స్త్రీ అనుభవించే మానసిక వేదనని గానీ ఎవ్వరూ పట్టించుకోలేదు.

స్త్రీ హృదయపు లోతుల్లోకి తొంగి చూడగలిగిన మహోన్నత జ్యోతి చలం! అందుకే ఆ హృదయపు శక్తిని కూడా దర్శించగలిగేడు ఆయన.

# మళ్ళీ తెరపై ఏక్‌తా?



మోహనీష్ బెహెల్‌తో పెళ్ళయ్యాక సినిమాలకు గుడ్‌బై చెప్పేసింది ఏక్‌తా.

ఓ బిడ్డకి తల్లి కూడా అయి రెండేళ్ళు కావస్తోంది కాబట్టి తిరిగి సినిమాల్లోకి రావాలని అనుకుంటున్నట్టు వార్తలు.

అయితే తిరిగి ఆమెకు ఇప్పుడు హీరోయిన్ ఛాన్సులే వస్తాయా? అసలు మోహనీష్‌కి ఇష్టమేనా? అనేది సందేహమే! -మౌర్య.

"శక్తి అంతా స్త్రీ శక్తి! సమస్త శాశ్వత ఘనకార్యాలకూ, ప్రయత్నాలకూ, వాఙ్మయాలకు, వెనుక ఉన్నది స్త్రీ శక్తి! స్త్రీ శక్తిని అధిగమించిన శక్తి ఏమైనా ఉంటే (ఉన్నదో లేదో ఆయనకు అనుమానమే) ఉంటే అది దివ్య శక్తి! దివ్యశక్తి నెరుగని నేను స్త్రీ శక్తిని ఆరాధించి కథలు వ్రాసేను" అంటారు ఈ మహా రచయిత.

అటువంటి స్త్రీ శక్తి, శక్తి విహీనమై మూల్గుతుంటే ఆయన గుండె దహించుకు పోతుంది. అందుకే స్త్రీని అర్థం చేసుకొనమని అర్థిస్తాడు, స్త్రీ హృదయ సౌకుమార్యం, ఈ ప్రపంచపు ఇనుప కాళ్ళక్రింద నలిగిపోతుందనే వేదనే ఈయన్ను ప్రవక్తగా చేసింది.

ఈ లోకపుటంచుల్ని దాటి... తనకు అందకుండా వెళ్ళిపోయిన అమీనా... ఈలోకపు సంకుచితత్వాన్ని, అల్పతాన్ని భరించలేక అదృశ్యమైన అరుణ ఏకమై... స్వర్గలోకం నుంచి దేవతా మూర్తియైన ఊర్వశిగా ప్రత్యక్షమౌతారు.. చలం గారి 'పురూరవ' నాటకంలో.

పురుషుని సంపూర్ణ జీవితానికి, ప్రేమ పరిపూర్ణతకు... స్త్రీ ప్రేమ, స్త్రీ సౌందర్యారాధన ఎంత అవసరమో ఊర్వశి ద్వారా వివరిస్తారు చలం. మహామతీ, మహాశౌర్యధుర్యుడూ, పరాక్రమశాలీ అయిన పురూరవ చక్రవర్తితో ఊర్వశి...

"స్త్రీ ముందు మోకరించడం నేర్చుకోని నువ్వు ఏం తెలుసుకున్నావు! ఏం జీవించావు! నీవింత అల్పుడవని తెలియదు నాకు" అని అతని అల్పత్వాన్ని హేళన చేస్తుంది. స్త్రీని ఆరాధించడం.

స్త్రీని ప్రేమించడం అనేవి అల్పత్వంగా స్త్రీలోలత్వంగా భావించే పురుషులకు కనువిప్పు... పురూరవ నాటకం. స్త్రీని ప్రేమించలేనివాడు.. ఆమెను తన మురికి అనుభవంలోనికి ఈడ్చడం కూడా చేతకాక... చీవాట్లూ, దెబ్బలూ, అవమానాలూ ఇవన్నీ ఆమె హృదయ ధీరత్వాన్ని... వొంచలేకపోతే నిరాశచెంది- తన అల్పత్వాన్ని ఒప్పుకొనే ధైర్యంలేక ఆ స్త్రీ మీద ద్వేషాన్ని, కసిని పెంచు కుంటాడు.

పురుషుణ్ణి కాల్చి, మెడవంచి, కళ్ళు తెరిపించి అతని ఆత్మని, అతనికి చూపడానికే స్త్రీ సౌందర్యం సృష్టించబడింది అంటారు చలం.

స్త్రీని స్త్రీగా ప్రేమించక... ఆమెను కామించి, మోహించడం వల్లనే లోకంలో ఈ వంచనలు, దగా కుళ్ళులు! అందుకే ప్రేమను ప్రేమించడం నేర్పుతుంది...ఊర్వశి పురూరవునకు,

చలం దర్శించినట్టు ప్రతి పురుషుడూ స్త్రీని అర్థం చేసుకొని ఆరాధించి... ప్రేమించగలిగిననాడు అందరూ ఆశించిన మరో ప్రపంచం మనకళ్ళ ముందుకే వస్తుంది. మహాత్మాగాంధీ ఆశించిన నిజమైన స్వాతంత్ర్యం అనాడు ఉదయిస్తుంది.

"ఎవరందుకోగలరు స్త్రీ హృదయ అగాధాలనీ... ఆ త్యాగశిఖర ఔన్నత్యాల్నీ" అని ప్రశ్నించిన చలం మాత్రమే బహుశా ఆ అగాధాలనూ, ఆ ఔన్నత్యాలనూ అందుకో గలిగారేమో!

**గమనిక:** ఈ వ్యాసంలో కొన్ని చోట్ల కులాల పేర్లు వాడవలసి వచ్చింది. మూల రచనల్లోకీ ఆ కులాల పేర్లు ఉండడం వలన వాటిని యధాతథంగా వాడటం జరిగింది.

చలం గారు తన నవలల్లో ఆయా కులాల నుండి పాత్రలను ఎంచుకున్నట్లు గమనించగలం. వీటిని లోతుగా విశ్లేషిస్తే ప్రేమ త్యాగం అనే వాటికి కులాలకూ ఏ సంబంధం లేదనీ, స్త్రీ హృదయంలో 'కులం' అనే దానికి స్థానమే లేదనీ స్పష్టంగా బోధపడుతుంది. కులమతాల సరిహద్దుల్లేని విశ్వమానవ ప్రేమైకరాజ్యం చలం సృష్టించిన ప్రేమ సామ్రాజ్యం!☆